క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సర్పంచ్‌లు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎదిర సర్పంచ్ బాల్‌రాజ్, చింతకుంటతండా సర్పంచ్ హరినాయక్, కాస్లాబాద్ సర్పంచ్ గోపాల్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, నాయకులు వెంకట నరసింహారెడ్డి, ఆంజనేయులు, యాదయ్య, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన గ్రామస్తులు

కొందుర్గు: చెక్కలోనిగూడ గ్రామానికి చెందిన పలువురు సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ వలన రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ఆ నమ్మకంతోనే వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. మరోసారి బీఆర్‌ఎస్‌కు ఓటువేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డితో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మొయినాబాద్ రూరల్: మత్స్యకారుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల అన్నారు. చెరువులు, కుంటల్లో చేప పిల్లల పంపిణీకి ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారం అందిస్తున్నారని తెలిపారు సోమవారం హిమాయత్‌నగర్‌లోని బూరుకుంట చెరువులో 50 వేల చేప పిల్లలను సంఘం అధ్యక్షుడు మల్లేశ్ వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులు అందరూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యామ్‌రావ్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్, యాదయ్య రమేష్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

షాబాద్: కుర్మలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాపోల్ నర్సింహులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఎస్పీ చేవెళ్ల పార్లమెంటు ఇన్‌చార్జిగా బర్క కృష్ణను నియమించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం నర్సింహులు మాట్లాడుతూ రాజ్యాధికారం సాధించుకోవాలని సూచించారు. హక్కుల సాధనకు పార్టీలకతీతంగా ఐక్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జంగయ్య, వెంకటేశ్, తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి



కవచాన్ని బహూకరిస్తున్న దాతలు

షాద్‌నగర్ రూరల్: ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట అంబా భవానిమాత ఆలయానికి వెంకట్‌రాంరెడ్డి, గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ యాదయ్యయాదవ్, వ్యాపారవేత్త శ్రీశైలంగౌడ్ రూ. 3.50లక్షలతో ఆలయం శిఖరానికి మూడు కలశాలు, అమ్మవారికి కవచాన్ని బహూకరించారు. అనంతరం వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, అర్చకులు మల్లేష్ పూజారి, యాదగిరి, పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి స్వాగతం

ఆమనగల్లు: కల్వకుర్తిలో జరిగే బహిరంగ సభకు వెళ్తున్న కేంద్ర మంత్రి పురుషోత్తంరూపాలకు ఆమనగల్లు పట్టణంలో బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ ఆయనను సన్మానించారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని నినాదాలు చేశారు. నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

బతుకమ్మ వేడుకల్లో మూడో రోజైన సోమవారం మూడు ఎత్తుల్లో పూలను పేర్చి, శిఖరం మీద గౌరమ్మను ఉంచుతారు. చామంతి, మందార తదితర పూలను ఉపయోగిస్తారు. ప్రధానంగా ముద్దపప్పును నైవేద్యం పెడుతారు. అందువల్ల 'ముద్దపప్పు బతుకమ్మ'గా వ్యవహరిస్తారు. బతుకమ్మ పూల పండుగతో పాటు దేవి శరన్నవరాత్రులను ఘనంగా జరుపుకొంటున్నారు. మహోత్సవాలకు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 9 రోజుల పాటు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.



చేవెళ్లలో..



షాద్‌నగర్: గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



షాబాద్: దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

కుల సంఘాలతోనే ఆర్థికాభివృద్ధి



నూతన కార్యవర్గాన్ని సన్మానించిన రవియాదవ్, సర్పంచ్ మంజుల

మొయినాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కులసంఘాల ఆర్థిక అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని అఖిలభారతయాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కులాల వారికి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సభ్యులందరూ ఐక్యమత్యంగా ఉన్నప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు.

గ్రామ కమిటీ ఇదే..

హిమాయత్‌నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా మల్లేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా జగదీష్, కార్యదర్శులుగా నరేశ్, శ్రీనివాస్, కోశాధికారిగా కుమారస్వామిని ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని రవియాదవ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంజుల, ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకుడు రాఘవేందర్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నర్సింహ్మ, వార్డు సభ్యుడు యాదయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు చంద్రయ్య, ప్రకాశ్, మహేశ్ తదితరులున్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

ఎంపీపీ బాలునాయక్

షాద్‌నగర్ రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఎంపీపీ బాలునాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం ఉష ఆధ్వర్యంలో సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన, ప్రమాద రహిత ఆర్టీసీ డ్రైవర్లకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలునాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాద రహిత డ్రైవర్లను, విధులపట్ల ఉత్తమ పనితీరును కనబరిచిన ఉద్యోగులను సన్మానించి ప్రసంశాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణంపై నమ్మకం కలిగే విధంగా సురక్షిత డ్రైవింగ్ చేస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల వైపు వెళ్లకుండా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్లు రహదారి నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, స్వామి, కిరణ్, రాధిక, పర్వతాలు, పాషామియా, శేఖర్, స్వామి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఉద్యోగులను సన్మానిస్తున్న బాలునాయక్

రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం



రేవంత్‌రెడ్డికి గజమాలతో ఘనస్వాగతం పలికుతున్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీమ్ భరత్ ఘన స్వాగతం పలికారు. సోమవారం సాయంత్రం వికారాబాద్ జిల్లాకు వెళ్తున్న ఆయనకు చేవెళ్ల మండల కేంద్రంలో భీమ్ భరత్ ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భరత్‌ను రేవంత్ వాహనంపై ఎక్కించుకొని పార్టీ నాయకులకు, శ్రేణులకు అభివాదం చేశారు. భరత్‌కు గెలిపించాలని కోరారు. అధ్యక్షుడికి స్వాగతం పలికిన వారిలో నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పీసీసీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ నాయకులు ఆగిరెడ్డి, వీరేందర్‌రెడ్డి, డీవీఆర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

దశదిన కర్మలో మంత్రులు

చేవెళ్ల: మండలంలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు వనం మహేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి తండ్రి నరసింహారెడ్డి దశదిన కర్మలో మంత్రులు మహేందర్‌రెడ్డి, సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం ఈర్లపల్లి సమీపంలోని జీవన్ రెడ్డి గార్డెన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వారు వేరువేరుగా పాల్గొని నివాళులర్పించారు. మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, జెడ్పీ చైర్మన్ అనితా రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ క్రిష్టారెడ్డి, చేవెళ్ల మండల బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు.

కబ్జాలకు పాల్పడితే చర్యలు

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో ఉన్న కుంటలు, నాలాలు, కాలువలను ఎవరైనా కబ్జాలకు పాల్పడితే ప్రభుత్వ పరంగా చర్యలు తప్పవని మండల ఇరిగేషన్ అధికారి లక్ష్మి హెచ్చరించారు. 'కొనసాగుతున్న రియల్ దందా' అనే కథనం ఆదివారం సాక్షి పత్రికలో వచ్చింది. ఈ నేపథ్యంలో బారాకంలో మా సని కుంట ఇరువైపుల ఉన్న కాలువలను కొందరు కబ్జా చేస్తున్నారనే వార్తకు ఇరిగేషన్, రెవె న్యూ అధికారులు స్పందించి బాకారం గ్రా మాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బా కారం గ్రామంలోని మాసని కుంట సర్వే నంబర్ 31ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు, ఇతరులకు నాలాలు, కుంట ద్వారా ఎలాంటి ఇబ్బందులు కలిగించిన చర్యలు తప్పవని సూచించారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ చంద్రమౌళి, సర్వేయర్ రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ మండల వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు పాల్గొన్నారు.

అవినీతి లేకుండా పాలన

- ప్రతిపక్షాలవి అర్థం లేని ఆరోపణలు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- భైర్కాన్‌పల్లి నుంచి ఎన్నికల ప్రచారం

కేశంపేట: నియోజకవర్గంలో అవినీతికి అస్కారం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. తనపై ప్రతిపక్ష పార్టీలు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. తనకు వారసత్వంగా వచ్చిన భూమి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. సోమవారం భైర్కాన్‌పల్లి గ్రామంలోని గుంటుక లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో పూజలు, మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి.. ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కులవృత్తులకు అధరణ పెరిగిందన్నారు. తెలంగాణ ప్రత్యే రాష్ట్రం ఏర్పాడితే అభివృద్ధి కుంటుపడుతుందని హేళన చేసిన వారే.. నేడు జరుగుతున్న అభివృద్ధిని చూసి కుళ్లుకుంటున్నారని విమర్శించారు. పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామంలో సీసీ రోడ్లకు రూ. 90లక్షలు, అండర్‌డ్రైనేజీకి రూ. 21లక్షలు, 149 మందికి ఆసరా పింఛన్లు, 38 మందికి కల్యాణలక్ష్మి, 740 మందికి రైతుబంధు, 10 మందికి రైతు బీమా ను అందజేశామని గుర్తుచేశారు. అభివృద్ధిని చూసి మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్‌నాయక్, సర్పంచ్‌లు కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

గెలుపుకోసం కష్టపడి పని చేయండి

మొయినాబాద్ రూరల్: ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేయాలని కాలె యాదయ్య సూచించారు. మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ భిక్షపతితో పాటు నాయకులు గోపాల్, ప్రవీణ్‌గౌడ్, ప్రభాకర్, రాజు తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించాలని సూచించారు.



భిక్షపతిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం

మొయినాబాద్ రూరల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పని చేద్దామని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్ కోరారు. సోమవారం మండలంలోని కనకమామిడిలో పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య నాయకుల అత్యవసర సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని కాపాడుకుంటూ వస్తున్న షాబాద్ దర్శన్‌కు చేవెళ్ల టికెట్ రాకపోవడం బాధాకరమన్నారు. అధిష్టానం 24 గంటల్లో పునరాలోచన చేసి, దర్శన్‌కు న్యాయం చేయాలని తీర్మానం చేసి గాంధీభవన్‌కు పంపారు. గౌరీ సతీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అమలు చేసిన మేనిఫెస్టోను ముఖ్యమంత్రి కేసీఆర్ కాపీ కొట్టారని ఎద్దేవాచేశారు. చేవెళ్ల టికెట్‌ను ఆశించిన దర్శన్‌కు అధిష్టానం సముచిత న్యాయం చేయాలని కోరారు. అనంతరం దర్శన్ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో మండల సహకార సంఘం చైర్మన్ చంద్రారెడ్డి, నాయకుడు మహేందర్ ముదిరాజ్, నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు మల్లారెడ్డి, మహేందర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

మధ్యాహ్నం కాంగ్రెస్.. సాయంత్రం బీఆర్‌ఎస్!



మధ్యాహ్నం కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ హరినాయక్



సాయంత్రం బీఆర్‌ఎస్‌లో చేరుతున్న సర్పంచ్ హరినాయక్

కొందుర్గు: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీగా ఉన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఖాయం చేసుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి, పథకాలపై ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లేడ్ చౌదరిగూడ మండలం చింతకుంట తండా సర్పంచ్ హరినాయక్ సోమవారం మధ్యాహ్నం వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా ఇదేరోజు సాయంత్రం అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ పరిణామాన్ని గమనించిన గ్రామస్తులు రాజకీయ నేతలపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఎన్నికల వేళ రైతుల గోస

- రుణమాఫీ కోసం అన్నదాతల ఆందోళన
- బ్యాంక్ ముందు భైఠాయించిన కర్షకులు



బ్యాంక్ ఎదుట భైఠాయించిన రైతులు

షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ తమకు అందలేదని అన్నదాతలు ఆందోళనకు దిగారు. రుణమాఫీని అమలు చేయాలని బ్యాంకు ముందు భైఠాయించి ధర్నాకు దిగారు. ఈ ఘటన పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదుట సోమవారం చోటు చేసుకుంది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన రైతు రుణమాఫీ హామీని ప్రభుత్వం అమలు చేసింది. లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తున్నామని ప్రకటించింది. ప్రభుత్వ హామీ అన్ని బ్యాంకుల్లో అమలు అయినప్పటికీ పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో అమలు కాలేదు. రుణమాఫీ కోసం అధికారుల చుట్టూ, బ్యాంకు చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటన చేసినా బ్యాకర్లు డబ్బులను చెల్లించాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు మాఫీ అయ్యాయని, బరోడా బ్యాంకులో రుణం తీసుకున్న రైతులకు నేటి వరకు రుణమాఫీ కాలేదని తెలిపారు. ఇప్పటికైనా బ్యాంక్ అధికారులు చొరవ తీసుకొని రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం

- వీర్లపల్లి శంకర్‌కు బీఆర్‌ఎస్ నాయకుల హెచ్చరిక

కొత్తూరు: ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులపై షాద్‌నగర్ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ చేస్తున్న ఆరోపణలు వెంటనే మానుకోవాలని మండల బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. మండలంలోని ఎస్‌బీపల్లి గ్రామంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని తెలుసుకోవాలన్నారు. పరిజ్ఞానం లేకుండా మాట్లాడడం మానుకోవాలని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో క్రమశిక్షణతో ఉంటారని తెలిపారు. అలాంటి వారిని ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎమ్మె సత్యనారాయణ, వడ్డె బాలయ్య, యాదగిరి,, శ్రీశైలం, మహేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పట్టుదలతో ఏదైనా సాధ్యమే



మొయినాబాద్: క్రీడాకారులు సాధనతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అదనపు కార్యదర్శి పార్వతీదేవి ఆకాంక్షించారు. చిలుకూరు గురుకులంలో నాలుగు రోజుల పాటు జరిగిన జోనల్ స్థాయి క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు పార్వతీదేవి బహుమతులను ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలంటే సాధన అవసరమన్నారు. జోనల్ స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ ఆదిబాబు, క్రికెట్ కోచ్ విష్ణు, బాక్సింగ్ కోచ్ శ్రీకాంత్, పీఈటీ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ శౌరిరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంటకలిసిన మానవత్వం!

- మంటగలుస్తున్న మానవ సంబంధాలు
- మత్తులో తూగుతున్న యువత
- చెడు వ్యసనాలతో ప్రాణాలు తీయడానికి వెనుకాడని వైనం

కొందుర్గు: మాయమైపోతున్నడమ్మ.. మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు అంటూ కవి గూడ అంజన్న.. ఈ స్వార్థపూరిత సమాజాన్ని ఎండగడుతూ హృదయాంతరాలను కదిలించారు. చిన్నచిన్న కారణాలతో కొందరు.. క్షణికావేశం మరి కొందరు.. బంధాలు, బంధుత్వాలు, అనుబంధాలు, అప్యాయతలు మరిచి క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ప్రస్తుతం మనం మనిషి మాయమైన సమాజంలో ఉన్నాం. విలువలు రోజురోజుకు మంట గలుస్తున్నాయి. అమ్మా నాన్న, అన్నా తమ్ముడు, భార్యాభర్త, తల్లీబిడ్డా అనే మమకారాలకు దూరమైన సమాజంలో భారంగా బతుకు ఈడుస్తున్నాం మనం. చెడు వ్యసనాలకు అలవాటు పడి కనిపెంచిన తల్లిదండ్రులు, తోడబుట్టిన సోదరులు, కట్టుకున్న భార్యను సహితం లెక్కచేయకుండా ప్రాణాలు తీయడానికి వెనుకాడటం లేదు. మద్యం మత్తులో కొందరు.. ప్రేమ పేరుతో మరికొందరు సాటి మనిషి ప్రాణాలను తీయడానికి ఏ మాత్రం వెనుకడుగు వేయడం లేదు. ఇలాంటి ఘటనలు మన జీవితం నిత్యకృత్యమయ్యాయి.



కరంటుతీగతో గొంతుకు బిగించడంతో మృతిచెందిన నవీన్

నమ్మించి హత్య చేసిన స్నేహితుడు

కొందుర్గు గ్రామానికి చెందిన పృథ్వి గౌడ్, రోహిత్ గౌడ్ హైదరాబాద్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే శివ అనే వ్యక్తి వీరితో స్నేహంగా ఉంటూ పృథ్విని హత్య చేశాడు. ఇక కొందుర్గు మండల కేంద్రంలోనే అక్టోబర్ 11వ తేదీ రాత్రి తనకు మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వడం లేదని గ్రామానికి చెందిన బోయ నరేశ్ తోడబుట్టిన అన్న నవీన్ నిద్రిస్తున్న సమయంలో కరెంటు తీగను గొంతుకు బిగించి హత్యచేసిన సంగతి తెలిసిందే.

భర్తను హత్య చేసేందుకు ప్రయత్నించిన భార్య!

కలకాలం కష్టసుఖాల్లో తోడుంటానంటూ బాసలు చేసి భర్తతో కలిసి ఏడడుగులు నడిచినా భార్య.. ప్రియుడి మోజులో పడి భర్తను హత్య చేయడానికి ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెలితే ఉత్తరాసిపల్లి గ్రామానికి చెందిన కావలి నర్సింలు భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధంపెట్టుకుంది. శనివారం రాత్రి ఇంటికే ప్రియుడి పిలుచుకొని భర్తకు పూటుగా మద్యం తాపించింది. అతను మత్తులో ఉండగా ప్రియుడి సాయంతో రొట్టెలు చేసే కరిసేను నిప్పుల్లో కాల్చి భర్త మర్మాంగాలపై వాతలు పెట్టిన ఘటన కలకలం రేపింది. ఇది తెలుసుకున్న భార్యను చితకబాదినట్లు సమచారం. ప్రస్తుతం బాధితుడు హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



ఉస్మానియాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉత్తరాసిపల్లి కావలి నర్సింలు